# కళ్ళూ అబద్ధాలు చెప్తాయి

'ఏంట్రా? నా ఫ్రెండని పరిచయం చేస్తే వాడికేసైనా సరిగ్గా చూళ్లేదు. ఎప్పుడూ ప్రతీవాళ్లతోటి స్టైలుగా షేక్‌హాండ్ ఇచ్చి లొడలొడా వాగేవాడి' అడిగాడు సిద్ధార్థ రఘునందన్ వెళ్లిపోగానే కాఫీ కప్పు కింద పెడుతూ పవన్‌ని.

'వాడంటే నాకసహ్యం' అన్నాడు. 'అసహ్యం' అనే మాటని నొక్కి పలుకుతూ పవన్, ఖాళీ కాఫీ కప్పుని సాసర్లో పెడుతూ.

'అంటే రఘునందన్ నీకు ముందే తెలుసా?'

'ఆ..'

'మరియితే చెప్పలేదేం?' ఆశ్చర్యంగా అడిగాడు. సిద్ధార్థ.

సింపుల్ - వాడికి నేను తెలీదు కనుక' అన్నాడు నవ్వుతూ పవన్.

'ఒరేయ్ తికమకగా మాట్లాడకురా. వాడు నీకెలి తెలుసో వాడంటే నీకు సదభిప్రాయం ఎందుకు లేదో చెప్పు' అన్నాడు అసహనంగా.

'ఒదిలెయ్‌రా, ఇప్పుడతేదో ముఖ్యమయిన పాయింటయినట్టు. మనం కాస్త ఆబిడ్స్ వరకు వెళ్ల రావాలి పద' అన్నాడు గడియారం చూసుకుంటూ పవన్.

'ఇప్పుడు ఆబిడ్స్‌కి ఎందుకు?అడిగాడు సిద్ధార్థ.

'రేపు మా ఆవిడ పుట్టినరోజు - చీరకావాలి'.

ఆవిడ పుట్టినరోజుకి ఆవిడను తీసికెళ్లి ఆవిడకి నచ్చిన చీరకొనక, నన్ను రమ్మంటావేంట్రా?' ఆశ్చర్యపోతూ అన్నాడు సిద్ధార్థ.

'ఒరేయ్, ఆవిడని సర్‌ప్రైజ్ చెయ్యాలనుంది మొన్న 'నా బర్త్‌డేకి ఏంచీర కొంటారు?' అని అడిగితే, ఏం కావాలి అని అడిగాను. ఆకుపచ్చ రంగుకి, గులాబీరంగు బార్డర్ కంచి పట్టుచీర కావాలంది. నా గుండె గుభేలుమంది. కంచిపట్టు చీరంటే కనీసం, మూడునాలుగు వేలయినా కావాలి. ఎలా? అందుకే 'కంచిపట్టూ అవన్నీ పెద్దవాళ్లకి గానీ నీలాంటి యంగ్‌స్టర్స్‌కి బాగుండదన్నాను. ఏ చీర ఎవరు కట్టుకుంటే బాగుంటుందో రిసెర్చ్ చేసినట్టు.

'చాల్లెండి... కొనకపోతే కొననని చెప్పండి కానీ ఈ కబుర్లన్నీ ఎందుకూ?' అంటూ రుస రుసలాడుతూ వెళ్లిపోయింది. అడక్కడక్క పెళ్లయిన మొదటి పుట్టినరోజుకి ఆమె కోరిక తీర్చలేకపోతున్నానే అనికూడా చాలా బాధపడ్డాను. కానీ ఏంచెయ్యను? చేతిలో డబ్బు లేప్పుడు నోరు మూసుకుని ఊరుకోవడం ఉత్తమం.'

'ఒరేయ్. ఇదేనా స్నేహం అంటే నన్నడిగితే నేనేదో సర్దే వాణ్ణిగా. మొదటి పుట్టినరోజు, పెళ్లయిన సంవత్సరం భర్త గొప్పగా జరిపితే ఆ భార్య పొందే ఆనందం, అనుభవిస్తే గానీ తెలీదురా' అన్నాడు గొప్ప అనుభవజ్ఞుడి ఫోజు పెడుతూ సిద్దార్థ.

'నిజమే, కాని అప్పుచేసి పబ్బంచేసుకోవడం అలవాటయితే ఇక నాకు ఒచ్చే బిరుదు' అప్పుల్రావ్. అని అన్నాడు. ఇద్దరూ హాయిగా నవ్వుకున్నారు వాళ్ల జోకుకి వాళ్లే.

'అనుకోకుండా నాకు లాస్టియరొచ్చిన ప్రమోషన్ తాలూకు వెరిఫికేషన్ జరిగి, డబ్బొచ్చింది. అందుకే, తనకి చెప్పకుండా తను కోరుకున్న చీరని తీసుకెళ్లి సర్‌ప్రైజ్ గిఫ్టిచ్చి, అప్పుడు ఆమె పొందే ఆనందాన్ని తనివి తీరా చూడాలనుంది' అన్నాడు పవన్.

'సరే పద' . . . అంటూ లేచాడు సిద్దార్థ.

ఇద్దరూ రెండు స్కూటర్లమీద బయల్దేరారు.

కంచిపట్టు చీరల దుకాణానికి, ఆకుపచ్చ, గులాబీరంగు అంచు చీర కోసం వెతుక్కుంటూ నాలుగయిదు దుకాణాలు తిరిగినా వారికి ఆ కాంబినేషన్ చీర దొరకలేదు. మరో దుకాణానికి వెళ్లేలోగా సిద్దార్థ అడిగాడు 'ఒరేయ్, ఆ రఘునందన్ అంటే నీ కెందుకంత అసహ్యం?' అని.

ఇంక చెప్పక తప్పలేదు పవన్‌కి.

'వాడుట్టి ఇడియట్. కిరాతకుడు' అన్నాడు.

'ఏం చేశాడు? అడిగాడు సిద్దార్థ.

'వాడు ప్రతీ రోజు భార్యని చావబాదేవాడు. ఇష్టం లేని పెళ్లి చేసుకుని, ఆ కచ్చని అలా ఆమెని చావబాది కసి తీర్చుకొనేవాడో, లేకపోతే తాగొచ్చి అలా కొట్టేవాడో తెలీదు కానీ. మరో ఇల్లాలైతే ఇటువంటి బ్రూట్‌కి ఏనాడో విడాకులిచ్చేసి వెళ్లిపోయుండేది పాపం. ఆ ఇల్లాలు నోరుమెదపదు. వీడు పొద్దున్న పోతే రాత్రి కెప్పుడో ఇల్లు చేరుకుంటాడు. అక్కడికి తనొక్కడే ఉద్యోగం చేస్తున్నట్టు' అతడి మీద తనకున్న అసహ్యాన్ని ప్రతీ అక్షరాన్ని నొక్కి చెబుతూ అన్నాడు పవన్.

సిద్దార్థ అంతా విని, 'ఓ, .. అదా సంగతి.' అన్నాడు నవ్వుతూ.

పవన్ ఆశ్చర్యపోతూ, 'నవ్వుతావేంటిరా. వాడి ప్రవర్తన చేసి మగాళ్లంతా సిగ్గుపడాలసలు. భార్యంటే నువ్వు కొట్టినా, తిట్టినా పడుండే పశువనుకున్నావా? లేకపోతే పాదాలు పట్టుకుని పడుండే దనుకున్నావా? ఆమెకూడా ఒక మనిషేననీ, ఆమెకీ వ్యక్తిత్వం వుందనీ, తిట్టినా, కొట్టినా బాధపడుతుందనీ ఆలోచించద్దూ? ఇలా బ్రూటల్‌గా ప్రవర్తించే మగ వాళ్లుండడం వల్లే, మహిళా సంఘాలు పురుషులందరినీ దుయ్యబడుతున్నారు. ఛీ, ఛీ! అయినా వాడు నీకెలా ఫ్రెండయ్యాడు?' ఆవేశంలో చెప్తూ అడిగాడు పవన్.

'ఒరేయ్ కళ్లుచూసినవన్నీ నిజాలు కావు. చెవులు విన్నవన్నీ సత్యాలు కావు. నిజం ఏమిటో పరికించి నిర్ధారణ చేసుకుంటే గానీ నిర్ణయానికి రాకూడదు' అన్నాడు సిద్దార్థ.

'ఏమిటో నేను చూసినదీ విన్నదీ కూడా అబద్ధమనిపించి నువ్వు చెప్పేది మాత్రమే నిజమనిపించి నిర్ధరణచేసుకున్న విషయం?' కొంచెం వ్యంగ్యంగానే అన్నాడు పవన్.

ఈ లోగా వాళ్లు వెళ్లానుకున్న దుకాణం రావడంతో, 'చెప్తా ముందు షాపింగ్ అయిపోనీ' అన్నాడు పవన్ దుకాణంలోకి దారి తీస్తూ.

ఒక అరగంట సేపు ఎన్నో చీరలు చూశాక, ఆకుపచ్చ రంగు గులాబీ బార్డర్ చీర దొరికింది. పవన్‌కి పున్నమి చంద్రుడు పూల చెండులా చేతికందినంత సంతోషం కలిగింది.

'ఒరేయ్ వాసంతి అంటే, నీకెంత ప్రేమరా? మొత్తానికి సాధించావు.' అన్నాడు సిద్దార్థ నవ్వుతూ.

'భార్య ఎప్పుడూ నవ్వుతూ వుండాలిరా. అప్పుడే ఆ ఇల్లు కలకల లాడుతూ వుంటుంది. కల కంఠి కంట కన్నీరొలికిన ఆ ఇంట్లో సిరీ వుండదూ, సంతోషమూ వుండదు. ఒరేయ్ ఆడదంటే అబలా గిబలా కాదురా..

'కార్యేషు దాసి - ఒద్దన్నా పనిచేస్తుంది. ఇక్కడ పనిమనిషి అని కాదు అర్థం తనింటికోసం తానుపనిచేస్తుంది 'కరణేషుమంత్రి' - భోజ్యేషుమాత, రూపేషులక్ష్మి, శయనేషు రంభ - క్షమయా ధరిత్రీ' అన్నారు పూర్వులు ఆమెని అవమాన పరిచినా, ఏడిపించినా పురుషుడి బతుకులో అశాంతి తప్పదు' ఉపన్యాసంలా స్కూటరు దగ్గర నిలబడి చెప్పాడు పవన్.

వెరీగుడ్.. మహిళామండలి వాళ్లందరికి తెలిస్తే నిన్ను వాళ్ల వేదికల మీద నుంచి దింపరు' అన్నాడు. సిద్దార్థ మళ్లీ నవ్వుతూ.

'అది సరే. నా నిర్ణయం, నేను చూసిన ఆమె ఏడుపులూ, వాడి తిట్లూ ఎలా తప్పో చెప్పు' అడిగాడు పవన్.

పద, చీరలు చూసి చేసి అలిసిపోయాంగానీ, ఏదైనా హోటల్ కెళ్లి 'టీ' తాగుతూ మాట్లాడుకుందాం. అన్నాడు సిద్ధార్థ.

సరే.. అంటూ ఇద్దరూ దగ్గరలోనే వున్న కామత్ హోటల్ కెళ్లారు.

'టిఫిన్ తింటావా? లైట్‌గా' అడిగాడు పవన్.

'ఒద్దు. సమీర రాత్రి టిఫిన్‌కి పెసరట్లు చేస్తానంది. ఇప్పుడు ఏమైనా తింటే రాత్రి సరిగ్గా తినలేను. సరిగ్గా తినకపోతే బాధపడిపోతుంది పాపం. అందులోనూ నా కిష్టమనీ, నా కోసమే చేస్తోంది' అన్నాడు సిద్ధార్థ.

'అదీ.. అలా వుండాలి. ఐ.. రెస్‌పెక్ట్ యువర్ సెంటిమెంట్..' అన్నాడు పవన్. బేరర్ టీ తీసుకురావడానికి వెళ్లాడు.

'ఆ... చెప్పు. 'సహనం నశించిపోతున్నట్టుగా అన్నాడు పవన్.

'వాడి భార్యామణిని నువ్వెప్పుడయినా చూశావా?అడిగాడు పవన్ ఆలోచించి. ఒకటి రెండు సార్లు వీధిలో బండిమీద కూరలు, ఇంకేదో కొంటూ కనిపించింది. బాగానే వుంటుంది. నెమ్మదస్తురాలిలాగానే అనిపించింది' పాపం చాలా మంచి పిల్లలాగా నోట్లో నాలుక లేనట్టుగా అనిపించింది' అన్నాడు ఇంకా ఏమైనా సంఘటనలున్నాయేమో తెలుసు కోవడానికి ప్రయత్నిస్తూ.

సిద్ధార్థ 'ఓస్.. ఇంతేనా? ఎంత బాగా తెలసో అనుకున్నాను. అన్నాడు నవ్వుతూ.

వాట్..డూ..యూ..మీన్..? పవన్ మొహం ఎర్ర బారింది. అది గ్రహించిన సిద్ధార్థ అదికాదోయ్ ఒక ఊరివాళ్ళో, తెలిసిన వాళ్ల దూరపు చుట్టాలో కనుక్కుందామని అడిగాను. అదేది కాదు కాబట్టి చెప్తా విను.

ఆవిడకి ఎప్పుడూ ఏదో ఒకటి కొనడం అంటే సరదా. పనిగట్టుకుని ఒకరోజు బజారుకెళ్లి అర్జంటుగా ఆటోలో, ఆటోకి పాతిక రూపాయలు ఖర్చుపెట్టి అయిదు రూపాయలకి నాలుగు చిన్న చిన్న చెంచాలు కొనుక్కొస్తుంది. లేదా ఎక్కడో డిస్కౌంటులో చీరలో ఇంకేవో వస్తువులు అమ్ముమ్మతున్నారని, లక్కడికి మళ్లీ ఆటోలో వెళ్ళి, ఒకరోజు ముందు చూసొస్తుంది. ఈ తరవాత ఎలాగో అలాగ అప్పుచేసో, చిట్టీలు కట్టో కొనేస్తుంది. అన్నింటికంటే, ఇంటి ముందరి కొచ్చే ప్రతీ వాళ్లని కేకేసి బేరాలు మొదలెడుతుంది. నెల పొడుగునా పొద్దుటి నుంచి రాత్రివరకు సెక్రటరీ పి.ఎ.గా విరామం లేకుడా పనిచేసే రఘునందన్‌కి ఈవిడ దుబారా ఖర్చుల వల్ల అప్పులు తప్ప ఏమీ మిగలడంలేదు'. అంటూ టీ రావడంతో చెప్పడం ఆపాడు

సిద్దార్థ టీ' తాగడం పూర్తిచేసి కప్పు కింద పెడుతూ. 'ఇదేం జబ్బు ఆ అమ్మాయికి' అన్నాడు సానుభూతి చూపిస్తూ పవన్.

'అంతటితో అయిపోలేదు. పాత బట్టలు తీసుకుని గిన్నెలిస్తాం' - అని అమ్మే వాళ్లకి తన మంచి మంచి చీరలిచ్చి పిచ్చిపిచ్చి స్టీలు సామాన్లు కొనడమే కాదు. వాడి మంచి మంచి పాంట్లు షర్టు కూడా ఇచ్చేసి పనికి రాని స్టీలు బిందెలూ, గ్లాసులూ, కప్పులూ ఏవేవో కొని పెట్టేస్తుంది. అల్మారా నిండా. వాడు బయటికెళ్లేవాడు కదా ఎట్లా చస్తాడు చెప్పు? బట్లరు బిల్లు తేవడంతో డబ్బులిచ్చి, వాడు మళ్లీ చిల్లర తెచ్చేవరకూ ఆగారు ఇద్దరూ.

'అయితే.. అతడు చేసిన పని మంచిదే.' పవన్ రఘునందన్ మీద జాలిపడిపోతూ అన్నాడు.

ఇంకా విను.. వాడు అంత కోపంలోనూ ఆమెని కొట్టడు తెలుసా? వాడు కాస్త కేకవెయ్యగానే, ఆ అమ్మాయి తలబాదుకుంటూ కొట్టినంతగా ఏడుస్తుంది. కేకలు పెడుతూ, ఎవరైనా వింటే వీడు కొట్టి చంపుతున్నట్టు కనిపిస్తుంది. ఈ బాధ పడలేక వాడు గుడ్డలు పూర్తిగా చిరిగితే గాని కుట్టించుకోవడం మానుకున్నాడు. ఇప్పుడు చెప్పు నువ్వు కళ్లతో చూసిందీ చెవులతో విన్నదీ నిజమేనా?'

ఐయామ్ ... సారీ రా..'

పూర్తి గా తెలియనిది ఏ విషయమైనా త్వరపడి నిర్ణయానికి రాకూడదు. దిస్.. ఈజ్...టూ...మచ్ అయినా వాడికి ఆ అమ్మాయంటే ఎంత ప్రేమోతెలుసా? ఎవ్వరికీ ఈ విషయం మాట మాత్రమైనా చెప్పడు. ఎవ్వరి ముందూ ఈ విషయం ప్రస్తావించడు. అయితే నీకెలా తెలిసింది?. అని అడుగుతావేమో' నాకు ఈ ఉద్యోగం రావడానికి ముందు వాడూ నేనూ ఒకే ఆఫీసులో ఆరునెలలు పనిచేశాం. ఒక ఫైనాన్స్ కార్పోరేషన్లో ఏదో కాగితం కావాలి అని చెప్పి నేను వాడింటి కెళ్లాను. ఒక రోజు తలుపు గడియవేసి లేకపోవడంతో తలుపు తీసుకుని గబుక్కున లోపలికెళ్లాను. వాడికి షాక్ కొట్టినట్టయింది. కళ్లనిండా నీళ్లు, తొట్రుపడ్డాడు నన్ను చూసినేను వాణ్ణి 'కూల్‌డౌన్, ఏం ఫరావాలేదు. అందరిళ్ళలోనూ జరిగేదే అన్నాను ఓదారుస్తున్నట్టుగా.

'తప్పంతా నాదేనండీ, అది కొత్తపాంటు అనుకోలేదు. అందుకనే ఇచ్చేశాను. అంది నేనున్నానక్కడ అని కూడా సంకోచించకుండా అవిడ.

పరవాలేదు సుధా! అంది పాతబట్టల మధ్య పడెయ్యడం నాదే తప్పు, ఆ మా ఇద్దరికీ కాస్త కాఫీ ఇవ్వు అన్నాడు నవ్వుతూ.

'నిజంగా ఆ క్షణంలో వాడొక దేవుడిలా కనిపించాడు' అన్నాడు సిద్దార్థ.

మైగాడ్' అంటూ బిల్లు చెల్లించి లేచారిద్దరూనూ.

'ఇప్పుడు మారిందా ఆ అమ్మాయి? ఉండబట్టలేక అడిగాడు పవన్.

'మారితే వాడి ఒంటి మీది బట్టలు ఎందుకలా వుంటాయి?చూశావుగా!' బయటి కొచ్చి ఇద్దరూ స్కూటర్ స్టార్ట్ చేశారు.

'ఒస్తా(నా నేను మళ్లీ కలుద్దాం హోప్.. యువర్...వైఫ్ లైక్.. దిస్.. సారీ..' అంటూ సిద్దార్థ బయలుదేరాడు.

'ఆఫ్‌కోర్స్ తనడిగిందే దొరికిందిగా' అన్నాడు నవ్వుతూ పవన్ తనూ స్కూటర్ స్టార్ట్ చేస్తూ. చెవుల్లో సిద్దార్థ మాటలు రింగుమంటున్నాయి. 'కళ్లు కూడా అబద్ధాలు చెబుతాయి' అని, స్కూటరు గబగబా పోతోంది. చిలకపచ్చ గులాబీరంగు బార్డర్ చూసి, భార్యామణి మొహం సంతోషంతో ఎంత వెలిగిపోతుందో ఊహించుకుంటూ'..

'ఎంత కాదనుకున్నా కళ్లముందు కనిపించినవన్నీ నిజాలు కావు. చెవితో విన్నవన్నీ సత్యాలు కావు.' సిద్దార్థ మాటలు బుద్ధుడి బోధలాగా చెవిలో రింగుమంటూ తన అజ్ఞానాన్ని చూసి వెక్కిరిస్తున్నయ్.

ఒకసారి ఇలాగే ఎ.పి. ఎక్స్‌ప్రెస్ రైల్లో ఒక అన్నా చెల్లెళ్లు ఎంతో సన్నిహితంగా మాట్లాడుకుంటూవుంటే వాళ్లిద్దరిరినీ చూసి వాళ్లు ప్రేమికులు అనుకున్నాడు. ఆ తరువాత మాటల్లో ఉండబట్టలేక నాగపూర్‌లో తను కొన్న సంత్రాలని వాళ్ల కిస్తూ 'మీ ఫియాన్సీకి ఇవ్వండి' అన్నాడు గొప్పగా తన వాళ్ల ప్రేమని పసికట్టేసినట్టు. అతడు సిగ్గుపడిపోయి ఐయామ్‌సారీ. ఈమె నా చెల్లెలు. మూడేళ్ల తరవాత ఇండియా కొచ్చానని, నన్ను రిసీవ్ చేసుకోవడానికి ఢిల్లీ కొచ్చింది. షి..ఈజ్.. ఎ.. డాక్టర్. నెక్స్ట్ మంత్ నామ్యారేజ్. తను కంప్యూటర్స్ కోర్స్ చేసింది. అన్నాడు. నా మొహాన చెప్పుచ్చుకు కొట్టినట్టయింది. నా అంతరాత్మ నన్ను నా తిట్లు తిట్టింది. 'బుద్దిలేదురా వెధవా, చనువుగా మాట్లాడితే ప్రియురాళ్లేనా? ఇదేనా నీ సంస్కారం' అని.

అలాగే మరోసారి అక్కా అన్నయ్య ఏదో నా గురించి గుసగుసగా మాట్లాడుతున్నట్టు అనుమానం వచ్చింది. ఈ విషయం పవన్‌కి చెప్పకూడదు. సీక్రెట్‌గా వుంచు' అంది అక్క. ఒ..కే.. నేనెందుకు చెప్తానూ? అన్నాడు అన్నయ్య. వాళ్లిద్దరూ నామీ ఏదో గూడుపుఠాణీ నాకు తెలీకుండా నామీద ఏదో చెప్పుకుంటున్నారనిపించి 'ఒళ్లుమండిపోయి, ఆ రోజంతా వాల్లతో మాట్లాడ్డం మానేశాను.

మర్నాడు నా పుట్టినరోజు. తెల్లార కుండానే లేచి బయటికెళ్ళిపోయాను. అందరూ విష్ చెయ్యడానికి ఎదురు చూసి చూసి, విసిగిపోయి రాత్రి నిద్రలో మునిగిపోయాక ఇంటికెళ్లాను. నా అలికిడి విని అన్నయ్య, అక్కయ్య లేచొచ్చి. పవన్! పుట్టినరోజు నాడు ఇంట్లో లేకుండా ఎక్కడి కెళ్లావురా? నీకోసం అందరం చూసి చూసి పడుకున్నాం. అమ్మయితే అన్నం కూడా తినలేదు. నీకని చేసిన పాయసం ఎవ్వరం తినలేదు. ఫ్రిజ్‌లో పెట్టేశాం.'అది సరే! ఉండు. నీకొక సర్‌ప్రైజ్' అంటూ గిఫ్ట్‌ప్యాక్ చేసిన ఒక ప్యాకెట్ చేతిలో పెట్టారు.

-'ప్రియమైన పవన్‌కి - అన్నయ్య, అక్కయ్య' అని రాసుంది. ఓపెన్ చేసి చూస్తే అది నేను ఎప్పటి నుంచో కొనుక్కోవాలని చూసిన ఆటోమేటిక్ బ్లాక్‌డయల్ టైటన్ రిస్ట్‌వాచ్. అక్కయ్య - అన్నయ్య డబ్బు పోగుచేసుకుని నాకు సర్‌ప్రైజ్ చెయ్యాలని వేసుకున్న ప్రోగ్రాం. వాళ్ల మాటలని నేను ఎంత తప్పుగా అర్థం చేసుకున్నానో! తలుచుకుంటే నామీద నాకే అసహ్యం వేసింది.

సిద్ధార్థ ఇచ్చిన సందేశానికి వాడి పాదాలకి నమస్కరించాలనిపించింది.

స్కూటర్ పార్క్‌చేసి ఇంట్లో కెళ్లేసరికి, అతని చేతిలోని ప్యాకెట్‌ని అందుకుంది షర్మిళ. ఆ చీరచూడగానే ఆమె మొహం, నిండు పున్నమి జాబిల్లిలా వెలిగిపోయింది. ఆమె సంతోషాన్ని తన్మయత్వంతో చూస్తూ అద్వితీయమైన ఆనందాన్ని అనుభవించాడు పవన్.

* * *